క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న డాక్టర్ బంగారయ్య

ఎస్.రాయవరం : అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం వచ్చేలా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నాయకుడు, కేజిహెచ్ మాజీ ఆర్‌ఎంవో డాక్టర్ బంగారయ్య అన్నారు. రెండు రోజులు క్రితం పి.ధర్మవరం గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన జోగ మంగ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వారికి నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం చేసి ధైర్యం చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మాణానికి దాచుకున్న నగదు కాలిపోయిందని వాపోయిన ఆమెకు మరింత సహాయం వచ్చేలా చేస్తానన్నారు. అలాగే జనసేన పార్టీ నాయకులు కూడా అగ్నిప్రమాద బాధితులను సోమవారం పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు.

'ప్రజారక్షణ భేరికి తరలిరండి'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

మునగపాక : ఈ నెల 14న విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణ భేరీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఇంటింటికీ కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నేత శ్రీనివాసరావు మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం జరిగే సభకు భారీగా తరలిరావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం అన్ని రకాలుగా పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎస్.బ్రహ్మాజీ, టిక్కలి జగ్గప్పారావు, ఆడారి ఆత్మారాం పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే సీపీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలంటూ అచ్యుతాపురంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోటేశ్వరరావు బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆర్.రాము, కె.సోమునాయుడు, రాంకుమార్, దొరబాబు, గురునాయుడు పాల్గొన్నారు.

మునగపాకలో బెల్లం క్రషర్ పాక దగ్ధం



కాలిపోయిన బెల్లం క్రషర్ పాక

మునగపాక : మునగపాకలో బెల్లం క్రషర్ పాక ఆదివారం రాత్రి దగ్ధమైంది. సుమారు రూ.50వేల మేర ఆస్తినష్టం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి. మునగపాకకు చెందిన పెంటకోట అచ్చియ్యనాయుడు, జగన్నాథరావు సోదరులకు బెల్లం క్రషర్ ఉంది. ఈ క్రషర్ ద్వారా బెల్లం తయారు చేసి అనకాపల్లి మార్కెట్‌కు తరలిస్తుంటారు. అయితే ఆదివారం రాత్రి బెల్లం క్రషర్ పాక అగ్నికి ఆహుతైంది. ఈ పాకలో రెండు పాకాల బెల్లం దిమ్మలతో పాటు మోటార్ కాలిపోయింది. స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో సుమారు రూ.50వేల మేర ఆస్తినష్టం సంభవించిందని అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా తగు పరిహారం అందించేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.



కార్తీక పూజలకు వేళాయె

- శైవ, వైష్ణవ ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ
- చారిత్రక శివాలయాలు ముస్తాబు



కొక్కిరాపల్లిలో పురాతన ఆలయంలో స్వయంభూ శివలింగం



ఏటికొప్పాక శివాలయంలో ముక్కంటికి పూజలు చేస్తున్న అర్చకుడు



ఏటికొప్పాక శివాలయంలో కొలువైన పరమశివుడు



పట్టణంలో కాశీ విశ్వేశ్వర త్రిమూర్తులు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



కొత్తపేటలో పురాతన రామలింగేశ్వరాలయంలో శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): శైవ సంప్రదాయాన్ని అనుసరించేవారు ఎక్కువగా శివపూజలు నిర్వహిస్తారు. వైష్ణవ సంప్రదాయంలో నడుచుకునేవారు విష్ణు ప్రతిరూప ఆలయాల బాట పడతారు. మరి శివకేశవులిద్దరు కలిసి పూజలందుకునే సందర్భం ఏదైనా ఉందా అంటే అదే కార్తీకమాసం. ఈనెల 14 నుంచి వచ్చే నెల 13 వరకూ నెల రోజులపాటు శివుడికి, విష్ణువుకు నిష్ఠతో పూజలు చేస్తారు. అందుకే ఈ మాసంలో శైవ, వైష్ణవ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడతాయి. ఈ 30 రోజులు దీపాలంకరణ ప్రత్యేకం. దీపారాధన చేయడం ద్వారా భక్తులు పుణ్యాన్ని ఆశిస్తారు. కార్తీక మాసం సందర్భంగా ఉదయాన్నే శివుడికి విశేష పూజలు, అభిషేకాలు చేస్తారు. ప్రతిరోజు అర్చకులు ధ్వజస్తంభంపై ఆకాశ దీపం వెలిగిస్తారు. పౌర్ణమినాడు జ్వాలాతోరణం వెలిగించడం పుణ్యదాయకమని విశ్వసిస్తారు. ఈ సందర్భంగా కార్తీక పూజలు నిర్వహించే ప్రముఖ శివాలయాల గురించి క్లుప్తంగా...

హరిహరాదులకు ప్రీతికరం

హరిహరాదులకు ఎంతో ప్రీతికరమైన కార్తీక మాసం మంగళవారం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో యలమంచిలి పట్టణంలో పురాతన కొత్తపేట రామలింగేశ్వర స్వామి ఆలయం కార్తీక పూజలకు సిద్ధమైంది. పాత ఆలయం జీర్ణదశకు చేరుకోవడంతో ఇక్కడ కొత్త ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెలంతా అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడ ఆలయానికి వచ్చి పరమ శివునికి పూజలు నిర్వహిస్తారు. సోమవారాల్లో వేల సంఖ్యలో మహిళలు తరలివస్తారు. ఇందుకు తగ్గట్లుగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

కాశీవిశ్వేశ్వరుల త్రిమూర్తుల ఆలయంలో..

పాత జాతీయ రహదారిపై కొలువుదీరిన కాశీవిశ్వేశ్వర త్రిమూర్తులు స్వామి ఆలయం కూడా ప్రసిద్ధి చెందిన ఆలయం. ఇక్కడ కాశీవిశాలాక్షి అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరునికి నిత్యాభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ అనువంశిక ధర్మకర్త వెలవలపల్లి త్రిమూర్తులుశర్మ తెలిపారు. గాజువాక బైపాస్ రోడ్డు పక్కన కొలువుదీరిన శ్రీ సోమస్కంద మూర్తి ఆలయంలో కూడా కార్తీక మాస పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ అర్చకుడు యరసూరి సీతారమసుబ్రహ్మణ్యం తెలిపారు.



గాజువాక బైపాస్ రోడ్డులో కొలువుదీరిన సోమస్కందమూర్తి

పురాతన స్వయంభూ శివాలయం..


కొక్కిరాపల్లి సమీపంలో ఉన్న పురాతన స్వయంభూ శివాలయం కార్తీకమాసంలో భక్తుల పూజలందుకునేందుకు సిద్ధం చేశారు. 150 ఏళ్ల క్రితం ఇక్కడకు సమీపంలో ఉన్న ఓతోటలో రామానుజాచార్యుల శిష్య బృందం బస చేసినపుడు ఇక్కడ స్వయంభూ శివలింగాన్ని ప్రతిష్ఠించినట్టు ఆలయ ప్రధానార్చకుడు ఆనివెళ్ల శ్రీనివాసశర్మ తెలిపారు. పట్టణానికి సమీపంలో శేషుగెడ్డ శివాలయంలో ప్రత్యేక పూజలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఏటికొప్పాక శివాలయం కూడా కార్తీక పూజలకు ముస్తాబైంది. తులసిదళాలు, బిల్వపత్రాలతో పూజలు నిర్వహిస్తారు. కార్తీకమాసం తొలిరోజు మంగళవారం నాడు పట్టణంతో పాటు గ్రామ గ్రామాన ఉన్న శైవక్షేత్రాలన్నీ శంభోశంకర నినాదాలతో హోరెత్తనున్నాయి.

పంచరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణ
- విశేష అలంకరణలో భూలోకమాంబ అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి



విశేష అలంకరణలో అమ్మవారు



ఆకట్టుకున్న కుమారస్వామి విద్యుత్ సెట్టింగ్

యలమంచిలి : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన యలమంచిలి పంచరాత్రి మహోత్సవాలు దీపావళి రోజున ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యలమంచిలి మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఆడారి శ్రీధర్ (చిన్నా) దంపతులు భూలోకమాంబ అమ్మవారికి తొలిపూజ నిర్వహించారు. అనంతరం విశాఖ డెయిరీ చైర్మన్ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపుగుప్తాతో కలసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పంచరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. పట్టణంలో తులసీనగర్, పాత వీధిలో భూలోకమాంబ, సుబ్రహ్మణస్వామివార్ల పంచరాత్రి ఉత్సవాలు సందర్భంగా భారీ విద్యుత్ దీపాలంకరణలు సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. ఆయా ఆలయాల వద్ద ప్రత్యేకమైన సెట్టింగ్‌లు ఆకట్టుకునేలా ఏర్పాటు చేశారు. ఏటా దీపావళి నుంచి నాగులచవితి వరకు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మళ్ల కొండబాబు, ఆడారి వెంకట్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

యలమంచిలి : యలమంచిలి పట్టణ శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి ఆనంద్ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా 14 తేదీ మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, జాతీయ పతాకావిష్కరణ, 15న పుస్తక ప్రదర్శన, సభ్యత్వ నమోదు, 16న గ్రంథాలయం ఉద్యమానికి కృషి చేసిన డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల సర్వోత్తమరావు సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 17న చరవాణి వాడుట వల్ల యువతపై ప్రభావంపై అనే అంశంపై వ్యాసరచన పోటీలు, ఇంటర్ డిగ్రీ విద్యార్థులకు మహిళా సాధికారతపై దిశా చట్టం-ప్రయోజనాలపై వ్యాస రచన పోటీలు ఉంటాయని తెలిపారు. 18న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు, ఇంటర్ డిగ్రీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, డ్రగ్స్ యువతపై ప్రభావం-పరిష్కార మార్గాలు.. అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. 19న మహిళా దినోత్సవం, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహిస్తామని, అలాగే 20న వారోత్సవాల ముగింపు, విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

దిమిలిలో...

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని లైబ్రేరియన్ ఎస్.శకుంతల తెలిపారు. ఈ సందర్భంగా పతాకావిష్కరణతో పాటు పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు పలు రకాల ఆటలు, పాటలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ రఘురాజుకు ఘన స్వాగతం



ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): రాష్ట్రానికి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ విజయనగరం జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపడుతున్న పాదయాత్ర సోమవారం రాత్రి యలమంచిలి మండలానికి చేరుకుంది. మండలంలోని షేకిళ్లపాలెం గ్రామంలోకి ఎమ్మెల్సీ పాదయాత్ర చేరుకునే సమయానికి యలమంచిలి మండలం, పట్టణానికి చెందిన పార్టీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు అక్కడకు చేరుకుని రఘురాజుకు సంఘీభావం తెలిపారు. 'జయహో జగనన్న చలో తిరుమల' పేరుతో చేపడుతున్న పాదయాత్ర 43 రోజుల పాటు 820 కిలోమీటర్ల దూరం కొనసాగుతుందన్నారు. పాదయాత్రకు అన్ని చోట్లా అపూర్వ స్వాగతం లభిస్తోందని ఎమ్మెల్సీ రఘురాజు సాక్షికి చెప్పారు. సంక్షేమ సారథి జగనన్న మరోసారి రాష్ట్రానికి సీఎం కావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నవరత్నాల అమలుతో పాటు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా పేదల పాలిట దేవుడిగా సీఎం జగన్ కీర్తింపబడుతున్నారన్నారు. కలియుగదైవం శ్రీనివాసుడి దయతో మరోసారి జగన్ సీఎం కావాలన్న బలమైన ఆకాంక్షతోనే పాదయాత్ర చేస్తున్నానన్నారు. గత నాలుగున్నరేళ్లలో సీఎం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలు ప్రజలకు పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్యగుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, పిల్లా త్రినాథ్, వార్డు కౌన్సిలర్లు చిరంజీవి, రాపేటి సంతోష్, కోడిగుడ్డు రమణ పాల్గొన్నారు.

నేడు ఉపమాక రానున్న స్వామివారి రథయాత్ర



స్వామివారి రథం

నక్కపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన రథయాత్ర మంగళవారం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయానికి వస్తుందని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, విజన్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో గత సెప్టెంబరు 25న తిరుపతిలో ప్రారంభమైన ఈ యాత్ర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 250 వేంకటేశ్వర స్వామి ఆలయాలను సందర్శిస్తూ చివరకు తిరుపతి చేరుకుంటుందన్నారు. ఈయాత్రలో భాగంగా మంగళవారం ఉపమాక రానున్న యాత్రకు స్వాగతం పలకడంతో పాటు, రథంలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలిరావాలని కోరారు. రథంలో ఉన్న మూర్తులకు పూజలు నిర్వహించిన తర్వాత ఈ రథం ఎస్.రాయవరంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చి, అక్కడ నుంచి అనకాపల్లి వెళ్తుందన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊరేగింపు



గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఊరేగింపు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి నిలుపు మహోత్సవం ఘనంగా జరిగింది. దీపావళి ముందురోజు అమ్మవారి ప్రతిరూపంగా వరి దుబ్బును తెచ్చి, అమ్మవారి ఆలయంలో నిలుపుదల చేశాక, అమ్మవారిని పట్టణ, గవరపాలెం పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం అమ్మవారిని ఆలయంలో నిలుపుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మీనాయుడు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పి.వి.రమణ, ప్రసాద్, దాడి కృష్ణ, పి.వి.సత్యనారాయణ, సూరిశెట్టి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక పుట్టుక మహోత్సవం



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మునగపాకలోని నూకాంబిక అమ్మవారి పుట్టుక మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. బైపాస్ రోడ్డు దరి ఆలయం ప్రాంగణంలో ఈ వేడుకలను నిర్వహించారు. గత 17 ఏళ్లుగా వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆలయ చైర్మన్ మళ్ల రామజోగినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ పెంటకోట సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, పెద్దలు పెంటకోట వెంకట్, సూరిశెట్టి కన్నారావు, పెంటకోట ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కోటవురట్ల: అన్నవరంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

వెంకటాపురంలో...

మునగపాక : మండలంలోని వెంకటాపురంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నాలుగున్నర ఏళ్లలో వెంకటాపురం గ్రామానికి జరిగిన అభివృద్ధి, అలాగే సంక్షేమానికి ఎంతమేర లబ్ధి చేకూరుతుందనే విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మన్మథరావు కోరారు.

గొర్రెలు, మేకల సంతలో తగ్గిన గిరాకీ



తాళ్లపాలెం సంతలో గొర్రెలు, మేకల అమ్మకాలు


కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకలు అమ్మకానికి తక్కుగా వచ్చాయి. కార్తీక మాసం రాకతో వీటికి గిరాకీ తగ్గింది. కొంతమంది వ్యాపారులు, పెంపకందారులు ఆశించిన ధర లభించక గొర్రెలు, మేకల్ని తిరిగి తమ ప్రాంతానికి తీసుకెళ్లారు. కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో దొండకాయ రూ.20, బంగాళాదుంప కిలో రూ.30, వంకాయ, బెండకాయ, టమాటా రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.80కి

బీజేపీ మండల అధ్యక్షుడిగా వేముల

పాయకరావుపేట : గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయడం జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు అన్నారు. పట్టణంలో గల బీజేపీ నాయకుడు తోట నగేష్ గృహంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా వేముల వెంకటేశ్వరరావును, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మంచాల గాంధీని నియమించినట్టు తెలిపారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట నగేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ మద్దతు ఇచ్చిన పార్టీయే విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోనికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పి.రవిరాజు, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ శ్రీరంగం రమేష్, పార్టీ కోటవురట్ల, ఎస్.రాయవరం అధ్యక్షుడు పి.కనకరాజు, పి.జోడినాయుడు, స్థానిక నాయకులు ఇంజరపు సూరిబాబు, పెంకే శ్రీను, ఎన్.మూర్తి పాల్గొన్నారు.

బొజ్జన్నకొండపై తాగునీటి సౌకర్యం పునరుద్ధరించాలి

అనకాపల్లిటౌన్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని శంకరం పంచాయతీ బొజ్జన్నకొండకు పిక్నిక్ కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కొండ వద్ద రెండు మాసాల క్రితం తాగునీటి మోటార్ పాడైపోవడంతో కొండకు వచ్చే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి, తాగునీటి సౌకర్యం కల్పించాల్సిందిగా కోరారు.



ఇంటింటా ఆనందాల వెలుగులు

- దివ్యంగా దివ్వెల పండగ
- బాణసంచా వెలిగించి సంబరాలు



ఉప్పరాపల్లి గణపతి ఆలయంలో దీపారాధన



గురుకుల పాఠశాలలో దీపాలు వెలిగిస్తున్న విద్యార్థినులు



బాణసంచా కాలుస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు



చెరకు గెడలకు దివ్వెలు వెలిగిస్తున్న దృశ్యాలు



కోటవురట్లలో బాణసంచా వెలిగిస్తున్న దృశ్యం

నక్కపల్లి/మునగపాక/కోటవురట్ల/ రాంబిల్లి / ఎస్.రాయవరం : దీపాల కాంతిలో పల్లెలు, పట్టణాలు మెరిసిపోయాయి. దీపావళి పండుగను ఆదివారం ప్రజలు సంప్రదాయ దుస్తులు ధరించి ఆనందోత్సాహాల నడుమ జరుపుకొన్నారు. అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరుతూ సాయంత్రం లక్ష్మీపూజ నిర్వహించారు. చెరకు గడలకు చివరన వత్తులు వెలిగించి దివ్వెలు కొట్టారు. ఇళ్లన్నీ దీపాలతో అలంకరించారు. టపాసులు, బాణాసంచా వెలిగించి సంబరాలు చేసుకున్నారు. బంధుమిత్రులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మిఠాయిలు పంచుకున్నారు. ఆలయాల వద్ద కూడా మహిళలు దీపారాధన చేశారు. పెద్దలు, పిల్లలు అంతా దీపావళి సంబరాల్లో మునిగి తేలారు. బాణసంచా విక్రయాల పట్ల పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. నక్కపల్లిలో గురుకుల బాలికల ఉన్నత పాఠశాలలో దీపావళి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాలికలు దీపాలు, బాణసంచా వెలిగించి సంబరాలు చేసుకున్నారు.

